# అందని ఆశలు

(గత సంచిక తరువాయి)

శర్మలోని సాంఘిక అభిప్రాయాలు కెరటాలు తెంచుకొని ప్రవహించాయి. 'భారత స్త్రీ' కష్టగాథను విని నీరై పోయాడు. తన వ్యక్తిత్వాన్ని కాపాడుకోడానికి, తన మానవత్వాన్ని నిలుపుకోడానికి యీ లోకంలో మానవులు ఎదురీత ఈదాలన్నాడు శర్మ. అందులో స్త్రీలైతే మరీ కష్టం అన్నాడు. వారు ఈ జీవిత ప్రవాహంలో కొట్టుకుపోవటం చూసి కూడా ఎవరూ బయటికి లాగి రక్షించే సంస్కారులు లేరన్నాడు. ఈ భావాలతో అతని హృదయం వికలమయింది. ఒక అనర్థ స్త్రీని, విద్యావతిని ఆదరించి, ఉద్ధరించి, ఆమె ఎదురీతకు చేయూత నివ్వ సంకల్పించాడు. ఆమెను తన ఇంటికి తీసుకుపోయాడు. "ఒక పురుషుడు ఒక స్త్రీ" ఉత్తమ ఆశయాలతో, ఉత్తమ అభిప్రాయాలతో ప్రాణ స్నేహితుల వలె కలిసి మెలసి మెలగలేరా?— అనుకొన్నారు వారిద్దరు. మాలతికి శర్మ ఉత్తమ స్నేహితుడైనాడు. కాలం గడుస్తున్నకొలదీ మాలతికి శర్మ అభిప్రాయాలు, ఆశయాలు తెలియసాగినాయి. శర్మయొక్క కమ్మని ఆశయాలు, తియ్యని మాటలు లేత మాలతికి ఆహారం అయింది. అతని భావాలు, ఆశయాలు తేట తెలుగు మాటలతో ప్రవహిస్తుంటే అందులో ఈదులాడింది. తన భవిష్యత్ జీవితాన్ని సృష్టించుకొంటూ కలలు కన్నది. ఉన్నతి మానవులను, అభ్యుదయ రచయితలను, కమ్మటి గాయకులను భగవంతుడేల పేదలుగా చేస్తాడు?— అనుకొంది. "ఇద్దరి కోరికలు ఒకటే అయినవి. ఇద్దరి భావాలు ఒకటే అయినవి. ఇద్దరి ఆశయాలు ఒకటే అయినవి. తను డబ్బున్న మనిషి. అతను నిరుపేద, అంతే తేడా" అనుకొంది మాలతి. చదువు తెలిసిన వానిని దారిద్ర్యమందుంచిన ఆ దేవతను స్మరించింది. కాలం శాంతంగా గడిచిపోవాలని కోరుకొంది.

వారిద్దరూ స్నేహితులుగా ఒక సంవత్సరం గడిచినది. ఈ సంవత్సరంలోను మాలతికి శర్మపైగల అభిప్రాయములలో మార్పొచ్చింది. మాలతి శర్మనుగురించి గట్టిగా ఆలోచించ మొదలు పెట్టింది. శర్మతో తను చేయి కలుపనా అనుకొంది. శర్మతో తను ఇక శాశ్వతంగా జీవితం సాగించనా అనుకొంది. ఎంతకాలం ఇట్లా స్నేహితురాలిగా ఉండను? అనుకొంది. అందుకే శర్మనుగురించి గాఢంగా ఆలోచిస్తున్నది. ఈ సంవత్సరంలోను మాలతికి శర్మ అర్థం కావటం లేదు. ఈ సంవత్సరంలో రోజురోజుకి తను ఊహించినట్టు శర్మ ఉండటంలేదు. శర్మ ఆశయాలు మహోన్నతమైనవే. అభిప్రాయాలు ఉత్తమమైనవే. సభ్యత కలవాడే. కాని అవి ఆచరణలో కనిపించడంలేదు;— మాటలలో ముత్యాలవలె మెరుస్తున్నాయి తప్పితే. "అతని భావాలు, ఆదర్శాలు, అతని నోటివెంటనే ఉండాల్సిందేనా?...ఆచరణ శూన్యమేనా?...అతనంతేనా?...శర్మ అంతేనా?...శర్మ మాటలు తప్పితే చేతలు శూన్యమేనా? అసలు అతని పంథా ఏమిటి?..." అని తీవ్రంగా ఆలోచించింది. తనకు శర్మ అర్థం కావటం లేదు—అనుకొంది. లేక తనే శర్మ కర్థం కావటంలేదా అని మళ్ళీ అనుకొంటోంది. అయినా శర్మతో మామూలుగానే మాట్లాడుతోంది. శర్మ నర్థంచేసుకోడానికి ప్రయత్నిస్తోంది. శర్మకు ఈ సంవత్సరకాలంలోను మాలతిపై అవ్యాజమైన ప్రేమ ఉదయించింది. అయినప్పటికీ, తన ఆదర్శాలను, ఆశయాలను ఆచరించలేకపోతున్నాడు. అతని ఆదర్శాలకు, భావాలకు, ఆశయాలకు పునాదులు లేవు. పునాదులేని సౌధంలా అతని భావాలూ, ఆశయాలూ ఆమెకు కనుపించాయి. అతను చెప్పే మాటలను నమ్మట్లు లేవు. అతని మాటల తియ్యదనంలో ఆమె ఆలోచించలేకపోతున్నది. ఆమె విన్నది అతను అందరి వెంటా పోతూంటాడని!! నిజమేనా?— అనుకొంది. శర్మ నిజంగా అటువంటివాడా?—అనుకొంది. ఏమైనా సరే, శర్మ అటువంటివాడు కాదు. తను పిచ్చిపిచ్చి ఊహాలు ఊహిస్తున్నాననుకొంది. అతను తను కోరే భావాలు కలవాడే. తనను ఉద్ధరించువాడే; తనకు అన్నివిధాల తగినవాడే; తనవాడే; శర్మ తనవాడే!! అనుకొంది మాలతి గాఢంగా!

శ్రీ మురళీధరరావు

## 3

మాలతి నల్లచీరపైన తెల్లచుక్కలున్న చీర కట్టుకొంది. తన శర్మ కిష్టమైన చీర కట్టుకొంది. భవిష్యత్ జీవితాన్ని కలలుగంటూ తన శర్మకోసం డాబాపై ఎదురుచూసింది. భవిష్యత్ జీవితం సుందరతరంగా తలచుకొని, ఎంతో ఆనందంతో శర్మకోసం ఎదురుచూసింది! శర్మ వస్తాడు! తన శర్మ వస్తాడు!! తన శర్మ తనతో వస్తాడు!!!—అనుకొని ఆనందించింది మాలతి. సాయంత్రం దేవాలయానికి వెళ్ళి దేవి సాన్నిధ్యంలో చేయి కలుప నిశ్చయించుకొంది. మనస్సులో ఒకమూల అతని నిజస్వరూపంగురించి ఆలోచించడం మొదలెట్టింది. "కాదు! ఏమైనాసరే అతను అటువంటివాడు కాదు!! అంతా అబద్ధం!!!" అనుకొంది. తన శర్మతో తను ఆనందమయ జీవితం గడపటం ఇష్టంలేని శత్రువులేవో తనను ఏడిపిస్తున్నారనుకొంది. "నేను జీవితం సాగించబోతున్నాను. నాకు కోరిన భర్త లభిస్తున్నాడు" అని మురిసిపోయింది మాలతి.

ఆమె కన్నీళ్ళలో ఈ గాథంతయు మెరిసింది. తను కలలుకన్న జీవితం కన్నీళ్ళలో కలిసిపోయింది. తను ఊహించింది నిజం అనుకొంది. "మాటలలో ఉన్నది చేతలలో లేదు" అనుకొంది. అతనా రాత్రి, అర్ధరాత్రి ఎక్కడినించి వచ్చిందీ ఆమెకి అర్థమయినది. అతను నిజాన్ని దాచేందుకు పడిన శ్రమ తెలిసింది. "ఇప్పటికి నేను అతన్ని పూర్తిగా అర్థం చేసుకొన్నాను" అనుకొంది మాలతి. తను నివసించిన సౌధానికి పునాదులేవని గ్రహించింది. అత్యంత అందమైన శిల్పాలతో నిర్మింపబడ్డ చక్కని సౌధానికి పునాదుల్లేవు!! ఆ సౌధంలో ఇంతకాలం విశ్రాంతి తీసుకొంది. ఆ సౌధం చక్కదనాన్ని ప్రేమించింది. ఆ సౌధంలోని శిల్పాలను చూసి మురిసింది. ఆ సౌధంలో శాశ్వతంగా జీవితం సాగించాలనుకొంది. కాని ఆ సౌధానికి పునాదుల్లేవు. ఎంత అద్భుతం! మాలతి మనసు పరిపరివిధాల పోయింది. మాలతి మనసులో ఇవన్నీ మెదిలాయి. "నేను చుక్కానిలేని పడవలో ఉన్నాను. పడవ ఎంత సుందరంగా వుండి, మంచి చక్కని నవీన సౌకర్యాలు కలిగినదైతే నేమి? చుక్కానిలేని కాడికి! చుక్కాని ఉంటేకదా దాన్ని నడిపేవారుంటానికి. నా జీవితం చుక్కానిలేని పడవవలె ఆధారపడవలసిందేనా?" అని మాలతి వాపోయింది.

మాలతి లేదు!!

ఏమయిందీ, ఎక్కడికెళ్ళిందీ ఎవరికీ తెలియదు.

చచ్చిపోయుంటుంది అంటారు ఊళ్ళో వాళ్లు!

ఎలా వచ్చిందో, అలాగే వెళ్ళింది— అంటారు మరికొందరు!!

అయినా, మాలతి లేదు;— కాని చావదు. మాలతి లాంటివారు చావరు. ఎదురీతలో విజయం పొందుతుంది మాలతి అనిపిస్తుంది!! ★